## క్లుప్తంగా

### నేడు ఎమ్మెల్యే రాక

**రేగొండ:** రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నేడు (శుక్రవారం) రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రెండు మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### మహిళ అదృశ్యం


సమ్మక్క

**టేకుమట్ల:** మండలంలోని సుబ్బక్కపల్లికి చెందిన బొడ్డు సమ్మక్క (48) అనే మహిళ బుధవారం అదృశ్యమైనట్లు ఏఎస్సై దాట్ల కుమారస్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన సమ్మక్క బుధవారం ఒంట్లో ఎవరూ లేని సమయంలో పర్కాలకు వెళ్లి అక్కడి నుంచి కాళేశ్వరం బస్సులో వెళ్లినట్లు గ్రామస్తులు తెలపడంతో ఆమె భర్త, కోడలు కాళేశ్వరంలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సమ్మక్క భర్త మల్లయ్య గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నట్లు ఏఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఫోన్ నంబర్ 87126 58146 ద్వారా సమాచారం అందించాలని కోరారు.

### చెట్లపొదల తొలగింపు

**వాజేడు:** మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి గ్రామంలో గురువారం రహదారి పక్కన ఉన్న పొదలను, పిచ్చి చెట్లను తొలగించారు. గ్రామంలోని రహదారుల వెంట ఉన్న పొదలను, పిచ్చి చెట్లను ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, సెక్రెటరీ అశోక్ పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ సిబ్బందితో తొలగించారు.

### 'చలో హైదరాబాద్' ను విజయవంతం చేయండి

**మంగపేట:** డిఫరెంట్ ఏబుల్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (డీఏఈడబ్ల్యూఏ)ఆధ్వర్యంలో డిసెంబర్ ఒకటిన తలపెట్టిన దివ్యాంగ ఉద్యోగులు చలో హదరాబాద్ కార్యక్రమాన్ని వజయవంతం చేయాలని ఆసంఘం గౌరవ సలహాదారు గడ్డం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. డిసెంబర్ 01న హైదరాబాద్ గాంధీ భవన్‌లో సమీపంలోని ప్రకాశం హాల్‌లో నిర్వహించ తలపెట్టిన దివ్యాగ ఉద్యోగుల సర్వసభ్య సమావేశానికి బాధ్యతగా ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కేడర్ల వారీగా బాధ్యతతో పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. సమావేశంలో దివ్యాంగ ఉద్యోగులకు అన్ని కేటగిరీలకు సంబంధించిన సమస్యలపై 33 జిల్లాల నుంచి చర్చ జరుగుతుందని పేర్కొన్నారు.

### ఇంటి వంటతో ఆరోగ్యం

**ఏటూరునాగారం:** ప్రస్తుత సమాజంలో బయటి వంటలు, ఆహారం తినడం వల్ల మనుషులు అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఇంటి వంట ఒంటికి ఆరోగ్యమని జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు అన్నారు. గురువారం మండలకేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు ఇంటి నుంచి స్వయంగా తయారు చేసిన వంటలను ప్రదర్శించారు. తయారు చేసిన వంటలను రుచి చూసిన హెచ్ఎం విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చాట్ల రవి, శిధర్, పల్లె నాగరాజు పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి

**మంగపేట:** మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన నిమ్మల సమ్మయ్య అనే వ్యక్తికి చెందిన పాడిగేదె విద్యుత్ షాక్‌తో గురువారం మృతి చెందింది. బాధితుడు సమయ్య తెలిపిన వివరాల మేరకు రోజువారీగా మేత కోసం గ్రామసమీపంలోని గోదావరి ఒడ్డుకు వెల్లింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కన గడ్డి మేస్తున్న క్రమంలో విద్యుత్ వైర్‌కు తాకి అక్కడికక్కడే మృతి చెందింది.

# పాలనాధికారులదే రాజ్యం

- ఇష్టానుసారంగా వ్యవవహరిస్తున్న కొందరు పంచాయతీ కార్యదర్శులు
- ఇంటి నిర్మాణాల అనుమతులకు వసూళ్లు


గణపురం మేజర్ గ్రామ పంచాయతీ భవనం

**గణపురం:** గ్రామాల్లో పరిపాలకులు లేరు.. దీంతో పాలనాధికారులదే రాజ్యం సాగుతుంది. వారు చెప్పిందే వేదం.. వారు చేప్పిందే.. శాసనంగా గ్రామ పంచాయతీ కార్యదర్శుల హవా కొనసాగుతుంది. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తయి నెలలు గడుస్తుండడంతో పంచాయతీల నిర్వాహణ పంచాయతీ కార్యదర్శులకు చేతికొచ్చింది. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు, వసూలయ్యే ఇంటి పన్నులు, నల్లా పన్నులు, వ్యాపార లైసెన్స్ లెక్కలు, ఇతరాత్ర ఆదాయం ఎంత వస్తుంది.. ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు వస్తున్నాయి.. ఎంత ఖర్చు అవుతుందని లెక్కలు అడిగే వారు కరువయ్యారు. దీంతో ఇష్టారాజ్యంగా లెక్కలు వేసి నిధులు కాజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గణపురం మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో 2 మేజర్ గ్రామ పంచాయతీలు. మేజర్ గ్రామ పంచాయతీలకు అధిక ఆదాయం ఉంటుంది. కానీ, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామ పంచాయతీలకు వెళితే డబ్బులు లేనిదే పనులు కావడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. నూతన ఇంటి అనుమతులు కావాలంటే రూ.వేలల్లో వసూలు చేస్తున్నారని దీనిపై అడిగే వారే కరువయ్యారని అంటున్నారు. ఎవరైన ఇంటి అనుమతికి ఇంత డబ్బులు తీసుకుంటారా.. అని అడిగితే.. ఎమ్మెల్యే సాబ్‌దే నా ఇలాకా.. నన్ను ఎవరూ ఏమీ చెయ్యరు.. అని ఓ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి దబాయిస్తున్నాడని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామ పంచాయతీల్లో గత 10 నెలల లెక్కలు ఆడిట్ చేయాలని, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు ఎన్ని నూతన ఇళ్లు నిర్మించారు.. వాటికి అనుమతులు ఉన్నాయా.. రికార్డుల ప్రకారం అనుమతులు లేని ఇళ్లు ఎన్ని.. అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# సీఎం దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు


కాళేశ్వరం: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

**చిట్యాల:** రాష్ట్రంలో ప్రభుత్వ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ కావడంతో ఓ విద్యార్థి మృతి చెందడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ టౌన్ అధ్యక్షుడు బుర్ర అభిజ్ఞ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకులాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు మృతి చెందడం బాధకరమన్నారు. విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అవినాష్, అజయ్, రోహిత్, హరికుమార్, శివ, నాగరాజు పాల్గొన్నారు.

**కాళేశ్వరం:** ఏబీవీపీ మహాదేవపూర్ శాఖ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను నగర కార్యదర్శి పేట సాయి ఆధ్వర్యంలో గురువారం దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యంగా మారిపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక నేటి వరకు 51 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వివిధ కారణాల వల్ల మరణించారన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. గురుకుల విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తూ తమది పేదల ప్రజల ప్రభుత్వమని అధికార పార్టీ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రఘు, సాయి, వరుణ్, విష్ణు, రంజిత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన తెలుపుతున్న కేజీబీవీ ఉద్యోగులు

**కాటారం:** సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ కనీస వేతన పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని కేజీబీవీ ఉద్యోగులు గురువారం నల్లబ్యాడ్జీలతో పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. కనీస వేతనం, రెగ్యులరైజేషన్ లేకుండా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి చల్ల సునీత, అరుణ, సరిత, శిరీష, సుజాత, మణిమాల, రాజమణి, స్వప్న, రాజేశ్వరీ, నళిని, శ్రీలత, లక్ష్మి, విజయ, మౌనిక, అనూష, దుర్గమ్మ, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# 'డబుల్' ఇళ్లు అర్హులకు కేటాయించాలి

- ధర్మసమాజ్ పార్టీ నాయకులు


ధర్నాలో చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

**భూపాలపల్లి రూరల్:** నిరుపేదలైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే కేటాయించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం వేశాలపల్లి డబుల్ బెడ్‌రూంల వద్ద కొంతమంది లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూంలు పంపిణీ చేయాలని కోరుతూ రెండో రోజు గురువారం బెడ్‌రూంల ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్ మద్దతుగా పాల్గొని మాట్లాడారు. గతేడాది అసెంబ్లీ ఎలక్షన్లను దృష్టిలో ఉంచుకొని నాటి ప్రభుత్వంలోని నాయకులు, అధికారులు ఇల్లందు క్లబ్‌లో 392 డబుల్ బెడ్ రూంలకు ఇళ్లకు నంబర్లు కేటాయించి ఇచ్చినట్టే ఇచ్చి మళ్లీ తీసుకున్నారన్నారు. వాటిని ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇవ్వకుండా ఖాళీగా ఉంచడంతో ఆ ఇళ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడంతోపాటు, శిథిలావస్థకు చేరుతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్, అధికారులు, స్పంచిందించి లబ్ధిదారులైన పేదలకు డబుల్ బెడ్‌రూంలను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు దశరథం, ప్రసాద్, రవి, డబుల్ బెడ్ రూంల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మహాసభను విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

**భూపాలపల్లి రూరల్:** డిసెంబర్ 6వ తేదీన వరంగల్ నగరంలో నిర్వహించే సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జన మహాసభకు జిల్లాలోని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేశ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ ఈ సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య కేంద్ర కమిటీ సభ్యులు నైనాలశెట్టి మూర్తి రాశ్ట్ర కార్యదర్శి రమేశ్ హాజరవుతున్నారన్నారు. సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిశ్కరించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ జనసభకు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి చంద్రగిరి శంకర్, ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి శీలపాక నరేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చంద్రగిరి ఉదయ్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కన్నూరి డానియల్, నీలాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


జనార్దన్ (ఫైల్)

**మొగుళ్లపల్లి:** పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పిడిసిల్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిడిసిల్ల గ్రామానికి చెందిన గడ్డం జనార్దన్ (65) వృత్తిరీత్యా యక్షగాన కళాకారుడు.. కూలీ పని చేసుకుని జీవనం కొనసాగించేవాడు. కొంత కాలం నుంచి టీబీ అస్తమాతో బాధపడుతున్నాడు. ఈనెల 25న తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమారులున్నారు.

# పోరాట యోధుడు జ్యోతిరావు పూలే


చిట్యాల: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న మల్లయ్య, తదితరులు


టేకుమట్ల: పూలేకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

- పుల్ల మల్లయ్య

**చిట్యాల:** దేశంలోని ప్రజల సమానత్వం, సమ సమాజ స్థాపన కోసం అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప పోరాటయోధుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవిత కాలం సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప మహనీయుడని అన్నారు. ఆయన సేవలు మరువలేవని అని కొనియాడారు. నాయకులు గుర్రపు రాజేందర్, మ్యాదరి సునీల్, కనకం తిరుపతి, పుల్ల ప్రతాప్, గురుకుంట్ల కిరణ్, పాముకుంట్ల చందర్, ఆరెపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**టేకుమట్ల:** మండలంలోని నవచైతన్య ఉన్నత పాఠశాలలో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ రాం మధు మాట్లాడుతూ మహిళలకు విద్య అవసరమని ప్రతీ మహిళ ఉన్నత చదువులు చదుకోవాలని నినదించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. స్త్రీ అబల కాదు సబల అని.. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా స్త్రీ ఎదగాలని స్త్రీ హక్కుల సాధన కోసం కృషి చేసారని గుర్తు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ నారాయణ, రామ్మూర్తి, రాజేశ్వరీ, సుమలత, ప్రియాంక, గీతారాణి, నితీష, చైతన్య, స్వరూప, మౌనిక, అనూష పాల్గొన్నారు.

### కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు


సన్మానిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

**కాళేశ్వరం:** మహాదేవపూర్ మండలం కాళేశ్వరాలయంలో పుష్పగిరి విట్రియో ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.గోవింద్‌హరి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ పక్షాన వారికి హరిత హోటల్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. మంథని నియోజకవర్గంలో అధునాతన టెక్నాలజీతో ఆస్పత్రి నిర్మాణం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యక్తిగత సహాయకులు, హాస్పిటల్స్ ఇన్‌చార్జ్ మహేంద్రయాదవ్, మహాదేవపూర్ ప్యాక్స్ చైర్మన్ చల్లా తిరుపతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కామిడి శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నాయకులు మాచర్ల సారయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు ముల్కల్ల మనోజ్ రెడ్డి, దాసరి కుమార్ పాల్గొన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో వాహనం దగ్ధం

**మంగపేట:** మండలంలోని వాడగూడెం -పాలాయిగూడెం గ్రామాల మధ్య టాటా మ్యాజిక్ ప్యాసింజర్ ఆటో వైరింగ్ షాట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైన ఘటన రెండు రోజుల క్రితం జరిగింది. మండలంలోని రామచంద్రునిపేటకు చెందిన ఆటో యజమాని(డ్రైవర్) అట్ల లక్ష్మణ్ తెలిపిన వివరాల మేరకు.. ప్రతి రోజు రాజుపేట నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని హనుమకొండకు వెళ్లి వస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈక్రమంలో మంగళవారం హనుమకొండకు వెళ్లి తిరిగి వస్తుండగా రాత్రి 10 గంటల సమయంలో పాలాయిగూడెం దాడిన తర్వాత అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. వెంటనే వాహనాన్ని ఆపి కిందకు దిగాడు. కొద్ది సేపటికే మంటలు ఆటోమొత్తానికి వ్యాపించి వాహనం పూర్తిగా కాలిపోయింది. రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, జీవన ఉపాధిని కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

# పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

- డీఎల్‌పీఓ వీరభద్రయ్య


రికార్డులను పరిశీలిస్తున్న వీరభద్రయ్య

**కాటారం:** గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని డీఎల్‌పీఓ వీరభద్రయ్య సూచించారు. కాటారం మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ గురువారం ఆయన సందర్శించారు. గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులు తనిఖీ చేసి నిధులు, ఖర్చు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పల్లెప్రగతి పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. కాలనీల్లో చెత్తాచెదారం నిల్వకుండా ఎప్పటికప్పుడు తొలిగించాలని, ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఆదేశించారు. రికార్డుల నిర్వాహణ సరిగా ఉండాలని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి బీరెల్లి కరుణాకర్ ఉన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై

**మల్హర్:** మల్హర్ మండల కేంద్రంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి ఆధ్వర్యంలో కొయ్యూరు పోలీసులు విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొయ్యూరు ఏఎస్సై హరికేశవరావు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు అనంతరం విద్యార్థుల చేత మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పశుగణనను తనిఖీ చేసిన జిల్లా పశువైద్యాధికారి


పశుగణనను తనిఖీ చేసిన జిల్లా పశువైద్యాధికారి

**కాళేశ్వరం:** మహాదేవపూర్ మండల కేంద్రంతో పాటు అన్నారం, సూరారం గ్రామాల్లో చేపడుతున్న పశు గణన కార్యక్రమాన్ని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి అసోద కుమారస్వామి ఆకస్మిక గురువారం తనిఖీ చేశారు. పశుగణనకు సంబంధించిన పోస్టర్లను స్థానిక పశువైద్యశాలలో ఆవిష్కరించారు. మండలంలో జరుగుతున్న పశు గణన సర్వేతో పశుసంపద డేటాను క్షేత్ర స్థాయిలో సేకరించాలని సూచించారు. అలాగే పశువుల యజమానులు కూడా పశువుల గణనకు వచ్చే అధికారులకు పూర్తి సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. ఈ గణనతో పశువుల లెక్క పక్కాగా తేలనుందని అన్నారు. దీనిని ఆధారంగా చేసుకుని సంబంధిత వ్యాక్సిన్లు, ప్రభుత్వ సబ్సిడీ దానా తదితర వాటిపై ప్రభుత్వాలు సులభంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డ్ అవకాశాన్ని పాడి రైతులు ఉపయోగించుకోవాలని రైతులతో మాట్లాడారు.ఆయన వెంట మండల పశువైద్యాధికారి రాజబాబు గౌడ్, సిబ్బంది హరినాయక్, కల్యాణ్, నాగభూషణం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలి

- స్వయంకృషి ఫౌండర్ కొట్టె సతీశ్


విద్యార్థులకు మెటీరియల్, ప్యాడ్లు అందజేస్తున్న స్వయంకృషి బాధ్యులు, నాయకులు

**కాటారం:** విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని స్వయంకృషి ఫౌండర్ కొట్టె సతీశ్ అన్నారు. కాటారం మండలం ధన్వాడ జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్వయంకృషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకరాంపల్లి వాసి డాక్టర్ అంగజాల కిషోర్ సహకారంతో పరీక్షా ప్యాడ్లు, స్టడీ మెటిరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ కొట్టె సతీశ్, శంకరాంపల్లి మాజీ సర్పంచ్ అంగజాల అశోక్ మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులని, దేశాభివృద్ధిలో వారి పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ లక్ష్యాన్ని ఎంచుకొని శ్రమించాలని సూచించారు. అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ముందుకెళ్లాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వారికి ఉపయోగపడాలనే సంకల్పంతో నాణ్యమైన స్టడీ మెటీరియల్ అందించినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్న ఫౌండర్ సతీశ్, సభ్యులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. సహకారం అందజేసిన డాక్టర్ కిషోర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, గ్రామస్తులు కొంద్రు శివ, బోడ శ్రీధర్, చిటూరి రాజేశ్, గోనె మహేశ్, రాజునాయక్, రవి, ప్రభుదేవా, ఆకుల చంటి, స్వయంకృషి సభ్యులు హైమద్, శేఖర్, రవి, రాజశేఖర్ పాల్గొన్నారు.

### 17మంది వృద్ధులకు కంటి శస్త్ర చికిత్స


ఆపరేషన్ కోసం వెళ్తున్న వృద్ధులు

**ఏటూరునాగారం:** మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 17 మంది వృద్ధులకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు శంకర్ ఐ ఆస్పత్రి ఇన్‌చార్జ్ బాలరాజు, అఫ్తాలమిక్ వైద్యుడు రిషాద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం పరిధిలో ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ హైదరాబాద్‌లోని శంకర్ ఐ ఆస్పత్రి యజమాన్యం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో అవసరం ఉన్నవారికి శస్త్ర చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. మిగతా వారికి పరీక్షలు చేసి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది బాలరాజు, భత్యుషా, తీరత్‌కుమార్, గన్‌దీప్, రాహుల్ మాలోతు పాల్గొన్నారు.